# గణనాధుడికి ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర ) :
యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో గణనాధుడి నవరాత్రులు సంధర్భంగా మహా అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని వైఏసీ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ప్రారంభించారు. అవినీతి రహిత సమాజం కోసం పనిచేస్తున్న తమ సంస్థకు గణనాధుడి అశీస్సులు ఎల్లవేళలా ఉండాలని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా తమ కార్యాలయంలో గణనాధుడి పూజ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం గణనాధుడిని నిమజ్జనం కార్యక్రమం అట్టహాసంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో డా. ప్రవంతి, కొన్నె దేవేందర్, గీతారెడ్డి, స్వప్న, రమేష్ బాబు, ప్రశాంత్, వంశీ కృష్ణ రాజేష్, హరిప్రకాశ్, గంగాధర్, నాగేంద్ర, నరేష్, తదితరులు పాల్గొన్నారు.




ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి | సోమవారం సెప్టెంబర్ 21,2026


# వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం రెండవ కళ్యాణ కట్టల్లో నాయి బ్రాహ్మణుల నిరసన

**దక్షిణ తీసుకున్నందుకు రూ15 వేల జరిమానా విధించారంటూ ఆరోపణ.**

వేములవాడ సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర)
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయరెండవ కళ్యాణ కట్టల్లో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులు శనివారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు తమను అనుమానాస్పదంగా చూస్తూ పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణులు మాట్లాడుతూ కళ్యాణ కట్టలకు వచ్చే భక్తులు తలనీలాలు




సమర్పించుకున్న అనంతరం తమ ఇష్టపూర్వకంగా రూ.50, రూ. 100 దక్షిణగా ఇస్తే మాత్రమే స్వీకరిస్తున్నామని కొందరు భక్తులు టికెట్ తీసుకున్నాం మేము ఎలాంటి డబ్బులు ఇవ్వమని వెళ్లిపోతున్నా వదిలేస్తున్నామని,తాము భక్తుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం లేదని స్పష్టం చేశారు. అయితే అధికారులు తమను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
పేజి 2లో

## మేడి సురేష్ సేవలకు గుర్తింపు.. ప్రేరణ స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ సేవా అవార్డు

ముస్తాబాద్, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర)



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన ప్రేరణ స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ సేవా అవార్డు--2026 లభించింది.సంస్థ అధ్యక్షుడు మేడి సురేష్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన భారత్ రక్తదాన్ ఎన్జీవో సంస్థ ఈ అవార్డుకు ప్రేరణ స్వచ్ఛంద సంస్థను ఎంపిక చేసింది.. పేజి 2లో

## మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీ.ఎస్.పి రాములు

మేడిపల్లి / భీమారం, సెప్టెంబర్ 20 ( విజన్ ఆంధ్ర ) :



మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను డీ.ఎస్.పి రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సైబర్ మోసాలకు గురయ్యే బాధితులకు సత్వర సహాయం అందించి, ఫిర్యాదులను బాధ్యతగా స్వీకరించాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న గణేష్ ఉత్సవాలు, మండపాల నిర్వహణ, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా. పేజి 2లో

## కళాసేవకు జాతీయ గుర్తింపు!!

**సింగరేణి ఉద్యోగికి నేషన్ బిల్డర్ అవార్డు**
**కనకం రమణయ్యకు ఘన సత్కారం**
**అవార్డుతో పరిమళించిన కళాకారుడి ఖ్యాతి**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):




సింగరేణి ఉద్యోగి, జాతీయస్థాయి జానపద కళాకారుడు కనకం రమణయ్యకు ప్రతిష్ఠాత్మక నేషన్ బిల్డర్ అవార్డు లభించింది. జీడీకే ఓసీపీ-3లో ఈపీ ఫిట్టర్‌గా పనిచేస్తున్న రమణయ్య గత 40 ఏళ్లుగా కళారంగానికి విశిష్ట సేవలందిస్తున్నారు. సింగరేణి, ప్రభుత్వ కార్యక్రమాల్లో వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ కళారంగంలో పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు..పేజి 2లో

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మెట్ పల్లి సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మెట్ పల్లి పట్టణంలోని 3వ వార్డు ఇంద్రానగర్‌లో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బల్ల సూరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బల్ల సూరి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
. పేజి 2లో

# వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం రెండవ కళ్యాణ కట్టల్లో నాయి బ్రాహ్మణుల నిరసన

(మొదటి పేజీ తరువాయి..)

**భక్తుల విషయంలో వివాదం**

రెండు రోజుల క్రితం వరంగల్కు చెందిన కొందరు భక్తులు తలనీలాలు సమర్పించుకున్న అనంతరం నాయి బ్రాహ్మణులకు తమ ఇష్టపూర్వకంగా దక్షిణ ఇచ్చారన్నారు. ఆలయ ఏఈఓ భక్తుల వద్దకు వెళ్లి నాయి బ్రాహ్మణులు డబ్బులు డిమాండ్ చేశారా.. అంటూ వీడియో తీసినట్లు వారు ఆరోపించారు. ఆ వీడియోను ఆలయ ఈఓకు అందచేసి ముగ్గురు నాయి బ్రాహ్మణులు రూ15 వేల చొప్పున చెల్లించాలని ఆదేశించినట్లు వారు వాపోయారు

**నాయి బ్రాహ్మిన్స్ కు కమిషన్ ఇవ్వాలని డిమాండ్..**

కళ్యాణ కట్టల్లో టికెట్ రుసుము రూ 50 గా ఉందని ఇందులో రూ 30 స్థానికంగా వంశ పారంపర్యంగా విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులకు చెల్లిస్తుండగా, రూ 20 దేవస్థానం ఆదాయంలో జమవుతున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా తాము కూడా ఎలాంటి జీతం లేకుండా విధులు నిర్వహిస్తున్నామని 3సంవత్సరాల క్రితం రెండవ కల్యాణ కట్టలో పనిచేస్తున్న వేములవాడ రూరల్ ఉఅర్బన్ నాయి(బ్రాహ్మణ సంఘానికి ఒక టికెట్ పైన 15రూపాయలు కమిషన్ ప్రతిపాదన పంపడం జరిగింది అది ఇంకా దేవాదాయ శాఖ కమిషనర్ గారి వద్ద పెండింగ్ లో ఉంది. టికెట్ రుసుములో నుంచి కనీసం రూ 15కమిషన్ఇవ్వాలని కోరుతున్నామన్నారు. దేవస్థానం నుంచి గానీ, కాంట్రాక్టర్ నుంచి గానీ ఎలాంటి జీతం లేదా కమిషన్ లేకుండా సుమారు పదేళ్లుగా స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తుల మొక్కుబడులైన తలనీలాలు తీస్తూ తాము విధులు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో తమకు కూడ స్థానిక నాయి బ్రాహ్మణుల మాదిరిగా కమిషన్ ఇస్తారనే ఆశతో ఇన్నాళ్లు ఎదురుచూశామని, భక్తులు ఇచ్చిన దక్షిణ తీసుకున్న వారి నుండి రూ 15 వేలు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తూ డబ్బులు చెల్లించకపోతే విధులకు రావద్దంటూ చెబుతున్నారని నాయి బ్రాహ్మణులు ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించకుండా, తమను పలు రకాలుగా ఇబ్బందుల గురిచేస్తున్న క్రమంలో విధులను బహిష్కరించి నిరసన తెలిపామన్నారు. అలాగే వేములవాడ దేవస్థానం మొదటి కళ్యాణకట్టలో అనాదిగా పనిచేస్తున్న నాయి(బ్రాహ్మణులు పక్క రాష్ట్రాలలో దేవస్థానంలో పని చేస్తున్న నాయి(బ్రాహ్మనులకు జీతాలు కల్పించారని, మాకు కూడా కావాలని కోరుకుంటున్నారని ఈ సందర్భంగా వారికి మా రెండవ కల్యాణకట్ట నాయి(బ్రాహ్మనుల సంపూర్ణ మద్దత్తు ఉంటుందని, వారికి జీతాలు కల్పిస్తూ, మాకు 15 రూపాయలు కమిషన్ ఇప్పించాలని దేవస్థానం అధికారులను కోరారు. లేని పక్షంలో ఉమ్మడిగా వేములవాడ దేవస్థానం రెండు కళ్యాణకట్టలు బందు చేసి నిరసన కార్యక్రమంలు చేస్తామని వారు తెలియజేసారు.

# కళాసేవకు జాతీయ గుర్తింపు!!

(మొదటి పేజీ తరువాయి..)

ఆయన సేవలను గుర్తించిన రోటరీ క్లబ్ ఆఫ్ మెగా సిటీ హైదరాబాద్, సంకల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ మాదాపూర్లోని ప్రాంతీయ సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నేషన్ బిల్డర్ అవార్డుతో సత్కరించింది. 33 జిల్లాలకు చెందిన కళ, క్రీడా, విద్యా, ఉద్యోగ రంగాలకు చెందిన 82 మందిని ఈ సందర్భంగా అవార్డులతో గౌరవించారు. డాక్టర్ గుంద్ర రోసి, తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ కళాకారుడు గుంద్ర కృపాదానం, కళారవళి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు విష్ణుదాస్ గోపాల్‌రావు చేతుల మీదుగా రమణయ్య పురస్కారం అందుకున్నారు. కోలిండియా కల్చరల్ గోల్డ్ మెడలిస్ట్‌గా గుర్తింపు పొందిన రమణయ్యకు ఈ అవార్డు మరో మైలురాయిగా నిలిచింది. పెద్దపల్లి జిల్లా నుంచి కళారంగంలో విశిష్ట సేవలందిస్తున్న సింగరేణి ఉద్యోగికి ఈ గౌరవం దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కళాకారుడిగా, సాంస్కృతిక గురువుగా రమణయ్య అందిస్తున్న సేవలను కొనియాడారు. రమణయ్యకు అవార్డు దక్కడంతో సింగరేణి కళాకారులు, గోదావరి కళా సంఘాల సమాఖ్య సభ్యులు, కనకం సంక్షేమ సంఘం ప్రతినిధులు, సహోద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తనను నేషన్ బిల్డర్ అవార్డుకు ఎంపిక చేసిన వారికి రమణయ్య కృతజ్ఞతలు తెలిపారు. కళాసేవకు దక్కిన ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ జానపద కళలను ప్రోత్సహిస్తూ తన సేవలను కొనసాగిస్తానని రమణయ్య ఆనందం వ్యక్తం చేశారు.

## ఆందోల్ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి దామోదర రాజ నరసింహ..

**సంగారెడ్డి డెస్క్ సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం రోజు ఆందోల్ నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా దాకూర్ లోని సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వట్పల్లి మండలం ఉసిరికపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మన్నే నర్సింలు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని వర్ధంతి లో మంత్రి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉసిరిక గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న మాజీ జెడ్పిటిసి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్



పట్లోళ్ల రాంరెడ్డిని మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా మార్వెల్లి గ్రామంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. శ్రీ సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మంత్రి వెంట పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్,మండల పార్టీ అధ్యక్షులు విశ్వాస్,మాజీ అధ్యక్షులు రమేష్ జోషి, ఆత్మ కమిటీ చైర్మన్ కమర్ రావు,జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి,పార్టీ నియోజక వర్గ ముఖ్య నాయకులు శేరి జగన్ మోహన్ రెడ్డి,సురేందర్ గౌడ్,దిగంబర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య,అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషా రెడ్డి, పెద్దపట్ల వినయ్ గౌడ్, గౌరెకల్ సర్పంచ్ లింగారెడ్డి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీనివాసరెడ్డి వివిధ గ్రామాల సర్పంచ్ లు,ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడి సురేష్ సేవలకు గుర్తింపు.. ప్రేరణ స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ సేవా అవార్డు

(మొదటి పేజీ తరువాయి..)

భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో ఆదివారం భారత్ రక్తదాన్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి సురేష్‌కు ఉత్తమ సేవా అవార్డు–-2026ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యుడు ఏర్పుల వెంకట్ పాల్గొన్నారు.ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించడం, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ సేవలను గుర్తించి సంస్థకు అవార్డు అందించడం పట్ల సంస్థ సభ్యులు, గూడెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మేడి సురేష్ మాట్లాడుతూ.. తమ సంస్థ సేవలను గుర్తించి ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్‌లో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి..)

ఇంకా ఎవరికైనా కార్డులు అందకపోతే వార్డులోని రేషన్ డీలర్‌ను సంప్రదించి కార్డులను పొందాలని సూచించారు.స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి, రాష్ట్ర వెలుమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బర్ల వంశీ, తరి అక్షయ్, ఉల్లెందుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీ.ఎస్.పి రాములు

(మొదటి పేజీ తరువాయి..)

ముందస్తు చర్యలు తీసుకోవాలని, మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో మర్యాదగా, గౌరవంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదులను సక్రమంగా స్వీకరించి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి తెలిపారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగే విధంగా విధులు నిర్వహించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

## జోగిపేటలో భారీ అగ్నిప్రమాదం

**-వ్యవసాయ గోదాంలో చెలరేగిన మంటలు...**

**జోగిపేట విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 20:-**

జోగిపేట పట్టణంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. జోగిపేటలోని వ్యవసాయ కార్యాలయ ప్రాంగణంలోని గోదాంలో శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చేలరేగాయి.ఈ విషయాన్ని గమనించిన న్యూ బాబ నగర్ కాలనీ వాసులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచార అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించింది.గోదాం ప్రధాన ద్వారానికి తాళం వేసి ఉండడంతో జెసిబి సహాయంతో గోదాంకు ఒక వైపు గోడను తొలగించి ఫైర్ ఇంజన్ ద్వారా మంటలను అర్పివేశారు.అప్పటికే గోదాంలోని ఉన్న సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు, ఇతర వ్యవసాయ పరికరాలతో పాటు, రైతులకు సంబంధించిన రైతు

# ఐక్యతకు నిదర్శనం గణపతి ఉత్సవాలు!!

**భక్తి.. ఆధ్యాత్మికత.. సోదరభావం**
**ప్రజల సుఖసంతోషాలే ఆకాంక్ష**
**గణనాథుని ఆశీస్సులతో ప్రజలకు మేలు**
**బీజేపీ నేత కందుల సంధ్యారాణి**

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):** రామగుండం నియోజకవర్గంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వేళ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పలు గణనాథుల మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కండేయ కాలనీ, విఠల్‌నగర్, బస్టాండ్ కాలనీ, ఎన్టీపీసీ కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను దర్శించుకుని ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు.



ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. అనంతరం కేసీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపాల వద్ద భక్తులతో కలిసి గణనాథుని ఆశీస్సులు కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని కందుల సంధ్యారాణి అన్నారు.



విఘ్నేశ్వరుడి కృపతో రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పండుగను భక్తిశ్రద్ధలతో, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో తడగొండ నరసయ్య, బియ్యాల మహేందర్, వెంకటేష్, జక్కన బాలు, పల్లపు సంపూర్ణ, సిలారపు కళ్యాణ్, స్వప్న, రజిత, లావణ్య, రమాదేవి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రుద్రవరం సింగిల్ విండో పాలకవర్గానికి ఘన సన్మానం

**వేములవాడ అర్బన్ సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర )**



వేములవాడ అర్బన్ రుద్రవరం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కత్తి కనకయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ పిల్లి కనకయ్యతో పాటు నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ పిల్లి కనకయ్యతో పాటు పాలకవర్గ సభ్యులు బేజుగం దేవరాజు, వంకాయల జ్యోతి, మారవేణి రాజ్‌కుమార్, లింగంపల్లి సింగరయ్య, గాలిపల్లి రవీందర్ గౌడ్, కూస శ్రీనివాస్, రెడ్డవేని మల్లేశం, శిలివేని మల్లేశం, తాడెం శ్రీనివాస్, నాంపల్లి కనకయ్య, మారవేణి లక్ష్మిలను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ‘ఊట్కూరి’ ఆధ్వర్యంలో గణపతి పూజలు

**మానకొండూర్ సెప్టెంబర్ 20 విజన్ ఆంధ్ర**

అన్నప్రసాదాల వితరణ

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో ఆదివారం గణనాథునికి ఇల్లంతకుంట ప్యాక్స్ చైర్మన్ ఊట్కూరి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం



భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు ఒగ్గు రమేష్, యాస తిరుపతి, సింగిరెడ్డి లక్ష్మి, ఎలుక అనిల్ కుమార్, లక్ష్మారెడ్డి, నవీన్ రెడ్డి, ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు, ఉప



సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎలుక రామస్వామి, సోమారంపేట సర్పంచ్ కేతిరెడ్డి భారతి లక్ష్మారెడ్డి , నాయకులు అంతగిరి వినయ్ కుమార్, తీగల పుష్పలత ,సత్తయ్య, బంగారు ఆంజనేయులు, రంగు రజని ,తదితరులు పాల్గొన్నారు.

# మొర్రాయిపల్లెలో ఘనంగా వినాయక చవితి వేడుకలు..

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి**

**ముస్తాబాద్, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర)**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లె గ్రామంలో శనివారం వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ముస్తాబాద్ మండల సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, వినాయక మండప నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేటరెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం

**గంభీరావుపేట సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర)**

గంభీరావుపేట మండల కేంద్రంలో రెడ్డి సేవా సంక్షేమ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పురోహితులు రాచర్ల పార్థసారథి శర్మ గణపతి హోమం, మరియు కుంకుమార్చన, అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు



పెద్ద ఎత్తున పాల్గొన్నారు . అనంతరం అన్నప్రసాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డమీద ప్రసాద్ రెడ్డి, ముత్యాల రాజిరెడ్డి, నీవు రి రాజిరెడ్డి,



లక్కిరెడ్డి సంతోష్ రెడ్డి, ముత్యాల సంజీవరెడ్డి, లింగ రెడ్డి గారి నరేందర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, సురేందర్ రెడ్డి తో పాటు పలువురు రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అశ్రునయనాల మధ్య సర్పంచ్ సుజాతకు అంతిమ వీడ్కోలు

మానకొండూర్ సెప్టెంబర్ 20 విజన్ ఆంధ్ర

**పాడె మోసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**అంత్యక్రియలకు భారీగా తరలివచ్చిన ప్రజలు**

శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామ సర్పంచ్ దుగ్గపు సుజాత (40) అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. గత కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమె కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు.

**సుజాత మృతి సమాచారం అందుకున్న తాడికల్ గ్రామం శోకసంద్రమైంది.**

సర్పంచ్ మృతి విషయం తెలుసుకున్న మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హుటాహుటిన తాడికల్ గ్రామానికి చేరుకుని సుజాత పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ పతాకాన్ని పార్థివదేహంపై ఉంచి నివాళులు అర్పించారు.ఆమె భర్త దుగ్గపు తిరుపతిని ఓదార్చారు.

అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని సుజాత



పాడెను మోశారు. వైకుంఠధామంలో నిర్వహించిన అంత్యక్రియల సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు కన్నీటితో కడసారి వీడ్కోలు పలికారు.సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి సుజాత చేసిన సేవలను పలువురు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆమె మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.సర్పంచ్ సుజాతకు వీడ్కోలు కలిపిన వారిలో పిసిసి సభ్యుడు మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, తాడికల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి గద్దపాక, మెట్ పల్లి ప్యాక్స్ చైర్మన్ లు కీసర సంపత్, గోపగోని బసవయ్య గౌడ్, గాజుల మహేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, పార్టీ నాయకులు గట్టు తిరుపతి, ఉప్పుగల్ల మల్లారెడ్డి, గొట్టె మధు,జనగాం రాజయ్య,ఆడెపు అజయ్, బండారు రమేష్,పులికృష్ణ, అంతగిరి వినయ్ కుమార్, సమ్మయ్య, పి.సంపత్ తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు,పార్టీ అధ్యక్షులు, అనుబంధ



సంఘాల నాయకులు,కార్యకర్తలు,ప్రజలు ఉన్నారు.

### మెట్ పల్లిలో...

శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గొట్టె మధు తల్లి కమల ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. కమల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### మన్నెంపల్లిలో..

తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.ఎల్. గౌడ్ మొదటి మాసిక సంస్మరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఎస్.ఎల్. గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా క్లెయిమ్ చెక్కు అందజేత....

**6 లక్షల 84 వేల బీమా క్లైమ్ చెక్కు ను బాధితులకు అందజేసిన ఈ డి శ్రీనివాస్ రెడ్డి**

ఓదెల సెప్టెంబర్ 20,(విజన్ ఆంధ్ర)

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని నాంసంపల్లె గ్రామానికి చెందిన పెనుకుల కొమురయ్య ప్రమాదవశాత్తు మృతి చెందగా శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా క్లైమ్ చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు ఈడి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు మాట్లాడుతూ 2022 సంవత్సరం లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లో ఓజ్జా శ్రీనివాస్,భిక్కు నాయక్ ల ద్వారా 21,803 పాలసీ తీసుకున్నారు.ఇటీవల ప్రమాదవశాత్తు పెనుకుల కొమురయ్య మృతి చెందడంతో యాక్సిడెంటల్ క్లెయిమ్ కింద నామిని అయిన మృతుని భార్య కు 6 లక్షల 84 వేల రూపాయల విలువైన



బీమా చెక్కు ను అందజేశామన్నారు.దీనితో పాటు 134 నెలల పాటు నెలకు 3 వేల రూపాయల చొప్పున పెన్షన్ మొత్తం 4 లక్షల 2 వేల రూపాయల వస్తాయన్నారు.మృతుని కుటుంబ సభ్యులకు మొత్తం బీమా ప్రయోజనం 10 లక్షల 86 వేల రూపాయలు వచ్చాయన్నారు.ఆర్థిక భద్రతను అందించడంలో బీమా ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఈడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఈడి శ్రీనివాస్ రెడ్డి, ఏజీఎం రాకేష్,డి ఎం శివ కుమార్,డివో లు గుండేటి మధు,కర్రె కుమారస్వామి,ఓజ్జే శ్రీనివాస్ సుమలత, ఎండి షబ్బీర్,సేల్స్ ఆఫీసర్స్ రవీందర్ రెడ్డి,అనగంటి శ్రీనివాస్,అరవింద్, శ్రీనివాస్,వెంకటస్వామి,చిన్న స్వామి, పూర్ణచందర్,నర్సయ్య,రాజు,మూడోతుల శ్రీనివాస్,మూడోతుల సదయ్య, సూర్యనారాయణ,మల్లేశం,ఎగ్జిక్యూటివ్స్ మహేందర్,ప్రశాంత్,సాయి,హరీష్,మారుతీ, శేఖర్,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా నిమజ్జనం జరపాలి: పుల్కం రాజు**

**వేములవాడలో భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులు**

వేములవాడ సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర )



వేములవాడ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వెలిసిన వినాయక మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం పుల్కం రాజు మాట్లాడుతూ..

ఎల్లుండి జరగనున్న వినాయక నిమజ్జనం సందర్భంగా వినాయక మండప నిర్వాహకులు మున్సిపల్ మరియు పోలీస్ శాఖలు సూచించిన నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పరస్పరం సహకరించుకుంటూ శోభాయాత్రను, నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన కేజీబీవి పాఠశాల హాస్టల్ విద్యార్థిని...

ఓదెల సెప్టెంబర్ 20,(విజన్ ఆంధ్ర)

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హాస్టల్ నుంచి కానరాకుండా పోయింది.పొత్కపల్లి పోలీసు తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 20 ఆదివారం ఉదయం 3:40 గంటల నుండి 9 గంటల సమయంలో విద్యార్థిని కనబడకుండా పోయింది.చివరిసారిగా స్నానానికి వెళుతుండగా ఉదయం 3 గంటల 40 నిమిషాల సమయంలో చూశామని, ఉదయం 9 గంటల సమయంలో టిఫిన్ కి వచ్చినప్పుడు విద్యార్థిని కనబడలేదని ఉపాధ్యాయులు తెలిపారు.తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# జగిత్యాలలో ఘనంగా అంబేద్కర్ స్మరణ కార్యక్రమం

**మహనీయుల ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి అంబేద్కర్ అంటే వ్యక్తి కాదు మహోన్నత శక్తి: నర్ర రాజేందర్**



**జగిత్యాల, డివిజన్ ఇంచార్జి సెప్టెంబర్ 20:(విజన్ ఆంధ్ర )**
డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా యూత్ అధ్యక్షులు (మాజీ) నర్ర రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్ర రాజేందర్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ నిర్వాహకులను అభినందించారు. భారత రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, రాజ్యాంగ హక్కులను తెలుసుకొని ప్రజాస్వామ్య పద్ధతుల్లో వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. నేటి యువత మహనీయుల జీవితాలు, వారి ఆశయాలను తెలుసుకొని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. యువత విలువలకు దూరమై చెడు మార్గాల వైపు వెళ్లడం ఆందోళనకరమని పేర్కొన్నారు. సమాజంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా కొనసాగుతున్న అంబేద్కర్ స్మరణ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సామాజిక, మహిళా వివక్షతో పాటు సమాజంలో ఉన్న అనేక అసమానతలను తొలగించేందుకు అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఆయన అందించిన రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సహించబోమని నర్ర రాజేందర్ పేర్కొన్నారు. అంబేద్కర్ అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఆయన ఒక మహోన్నత శక్తి అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్ ఆశయాలకు గుర్తింపు లభిస్తున్నప్పటికీ, దేశంలో అక్కడక్కడా ఆయనపై అనుచిత వ్యాఖ్యలు, ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అంబేద్కర్‌వాదులందరూ సంఘటితమై రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చిత్తారి ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశానికి అంబేద్కర్ అందించిన సేవలు, సమానత్వం, సామాజిక న్యాయం, సామాజిక సంస్కరణల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా జగిత్యాల జిల్లా అధ్యక్షులు చిత్తారి ప్రభాకర్, తెలంగాణ శక్తి ఎడిటర్ అనంతల కాంతారావు, క్రిస్టియన్ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, రిటైర్డ్ జగిత్యాల పట్టణ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కంటి అంజయ్య, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గిద్దె శంకరయ్య, మిన్నేని రవీందర్ రావు, రుద్ర మనోహర్, దాసరి లచ్చయ్య, బొల్లం ప్రభాకర్, వేల్పుల ప్రవీణ్, కండక్టర్ అశోక్, చెనాల్ల సుమన్, రమేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు శ్రీహరి, వెల్దుర్తి రవి, మాల సంఘాల జేఏసీ కన్వీనర్ కడారి రమేష్, నూకల కుమార్, నూకల అశోక్, కారంగుల అభిషేక్, సంకె మహేష్, కుసుమ సాయి కుమార్‌తో పాటు జగిత్యాల జిల్లా అంబేద్కర్ సంఘం నాయకులు, పలువురు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులలో సవరణలు: పౌర సరఫరాల శాఖ.

**బోయినిపల్లి సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):**
బోయినిపల్లి మండలం, లోని గ్రామ ప్రజలకు మరియు మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా, మీ గ్రామాలలో జారీ చేయబడిన స్మార్ట్ రేషన్ కార్డులలో ఏవైనా తప్పులు, మార్పులు లేదా సవరణలు (అనగా పేరు, చిరునామా, పిన్ కోడ్ లేదా ఇతర వివరాలు) ఉన్నచో, వెంటనే మీ మండల తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించవలసిందిగా తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల అధికారులు తెలియజేశారు. ఈ ముఖ్యమైన విషయాన్ని ప్రజలందరికి తెలియజేయనున్నారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు

## బాల,బాలికల కు చెస్ పోటీలు: జెడ్ పి హెచ్ ఎస్ విలాసాగర్.

**బోయినిపల్లి సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):**
బోయినిపల్లి మండల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు మరియు వ్యాయామ ఉపాధ్యాయులకు తెలియజేయునది ఏమనగా తేదీ 21 సెప్టెంబర్ 2026 వ రోజున బోయినిపల్లి మండల, అండర్ 17 ఇయర్స్ మరియు అండర్ 14 ఇయర్స్ బాల,బాలికల చెస్ పోటీలు జడ్పిహెచ్ఎస్ విలాసాగర్ పాఠశాల లో ఉదయం 10 గంటలకు నిర్వహించబడునని తెలుపడం జరిగింది. మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్ మరియు నర్ర శ్రీనివాస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్, ఎస్జీఎఫ్ మండల కన్వీనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మరిన్ని వివరాల కొరకు ప్రభాకర్ ఫిజికల్ డైరెక్టర్ గారిని సంప్రదించగలరు. చెస్ ఆడాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజ

**రుద్రంగి, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):**
మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శివసేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించి గణనాథుని దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పంటలు సమృద్ధిగా పండాలని వేడుకొన్నారు. కుంకుమ పూజ చేయడం వల్ల సకల సంతోషాలు కలుగుతాయని మహిళలు తెలిపారు.



## పలు గణేష్ మండపంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది ప్రత్యేక పూజలు.....

**రుద్రంగి, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర):**
వినాయక నవరత్రోత్సవాలు భాగంగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం మండల కేంద్రంలోని పలు యూత్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యూత్ సభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు,వేద పండితులు ఘన స్వాగతం పలికి వేదర్వచనం ఇప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా కొనసాగాలని స్వామివారిని వేడుకొన్న మన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకర్షించారు .వినాయక చవితి ఉత్సవాలలో ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఐక్యత భావంతో నిర్వహించుకోవాలన్నారు. ఆయనతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## గాడిద కష్టం తీరింది.. ఆదాయం పెరిగింది

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రవీందర్‌నగర్‌కు చెందిన వెంకటేశ్‌కు వారసత్వంగా మూడు గాడిదలు వచ్చాయి. ఊరూరా తిరుగుతూ వాటి పాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రోజూ కాలినడకన ఊర్లు తిరగడం అటు అతనికి, ఇటు గాడిదలకు కష్టంగా మారడంతో ఒక ఉపాయం ఆలోచించాడు. ఓ పాత ఆటో కొనుగోలు చేసి, గాడిదలకు ఎక్కడం.. దిగడం, ప్రయాణ సమయంలో నిలకడగా ఉండటంపై శిక్షణ ఇచ్చాడు. ఆపై ఇలా రోజూ ఒక గాడిదను ఎక్కించుకుని ఇంటింటికి తిరుగుతూ పాలను విక్రయిస్తున్నారు. దీనివల్ల కష్టం తీరడంతోపాటు ఎక్కువ ఊర్లు తిరగడంతో ఆదాయమూ పెరిగింది. గ్లాసు పాలను రూ. 100కు విక్రయిస్తున్నానని, రోజుకు రూ. 2 వేల వరకు మిగులుతోందని వెంకటేశ్ చెప్పారు.



# జాతీయ ఉపాధి హామీ లో పని కల్పించాలి: జిల్లా ప్రధాన కార్యదర్శి.

**పట్టణాలలో విలీనమైన గ్రామాల ప్రజలకు, నిరుద్యోగ యువతకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని కల్పించాలి.**

**రోజువారి వేతనం 600 ,రూపాయలు చెల్లించాలి.**

**పని కల్పించే బాధ్యత ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం డిమాండ్.**

**బోయినిపల్లి సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ మున్సిపల్ లో విలీనమైన నాంపల్లి గ్రామంలో రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు ఆదివారం రోజున దళితవాడలో సందర్శించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి, ఆయన మాట్లాడుతూ..



వేములవాడ పట్టణంలో తిప్పాపురం,నాంపల్లి, అయ్యోర్ పల్లి, శాత్రాజుపల్లి, కోనయ్ పల్లి, గత ఆరు సంవత్సరాల క్రితం వేములవాడ మున్సిపల్ లో విలీనం చేయడం వల్ల, ఇక్కడున్న ఈ ప్రాంత వాసులు పని లేక అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాం విలీనమైన గ్రామాలకు ఇప్పటికైనా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని కల్పించవలసిన బాధ్యత ఈ ప్రభుత్వాల మీద ఉన్నది కాబట్టి, అభివృద్ధి పేరుతో ప్రజలకు పని లేకుండా ఇంటికే పరిమితం చేయడం అనేది చాలా దారుణం, ప్రభుత్వం చేసిన పని ఏదైతే ఉందో, సమంజసమైన విషయం కాదని ప్రభుత్వంలో ఉన్నటువంటి పాలకులు ఆలోచించాలి. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పని కింద పని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. కాబట్టి బే శరత్తుగా పని కల్పించాలని ఈ సందర్భంగా వేములవాడ నియోజకవర్గం ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ఆది శ్రీనివాస్ స్పందించి పని కల్పించాలని, తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం తరపున డిమాండ్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘంప్రధాన కార్యదర్శి గురి జాల శ్రీధర్, మరియు నాంపల్లి గ్రామస్తులు పద్మ, సత్తవ్వ, మునవ, రజిత, రాజేశ్వరి, ప్రియాంక, దుర్గవ్వ, లచ్చవ్వ, సుగునవ్వ, సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.

## పోతుగల్‌లో అంబేద్కర్ యువజన సంఘం, క్రాంతి యూత్ ఆధ్వర్యంలో గణనాథుడికి ఘన పూజలు

**ముస్తాబాద్, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం, క్రాంతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు



చేసిన వినాయక మండపం వద్ద గణనాథుడికి ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో గణనాథుడిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, క్రాంతి యూత్ సభ్యులు, యువత, మండప నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సొత్తు దొరికింది.. ఓకే !..దొంగోడేమయ్యాడు..?

**మెట్ పల్లిలో పట్టపగలు ఇంట్లో చోరీ..**

**స్థానికులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన నిందితుడు**

**దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన పట్టణవాసులు**

**చోరీ సొత్తు యజమానికి చేరిందా ?**

**అరెస్టు మాత్రం చూపని పోలీసులు**

**కవిత పర్యటనలోనూ చేతివాటం.. మెట్‌పల్లిలో దొంగల హల్‌చల్**

**మెట్ పల్లి డివిజన్, సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర)**

చోరీ జరిగింది.. దొంగ స్థానికులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు.. పట్టుకున్నవారు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.. అతడు దొంగిలించిన సొత్తు తిరిగి యజమానికి చేరింది అనే సమాచారం. ఇంతవరకు అంతా బాగానే ఉంది. మరి పోలీసులకు అప్పగించిన ఆ దొంగ ఏమయ్యాడు..? అతడిపై కేసు పెట్టారా..? అరెస్టు చేశారా..? కోర్టులో హాజరుపరిచారా..? లేక లోలోపలే వ్యవహారం ముగించారా..? ఇప్పుడిదే మెట్‌పల్లి పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దొంగను పట్టుకున్నది ప్రజలు, పోలీసులకు అప్పగించిందీ ప్రజలే. అతడి వద్ద దొరికిన చోరీ సొత్తును యజమానికి అప్పగించినట్లు తెలుస్తున్నప్పటికీ, దొంగ అరెస్టును మాత్రం పోలీసులు ఇప్పటివరకు అధికారికంగా చూపకపోవడం వెనుక ఏం జరిగిందన్నది అంతుచిక్కడం లేదు. దొంగిలించిన సొత్తు దొరికినప్పుడు.. దానిని దొంగిలించిన వ్యక్తి మాత్రం కేసు నుంచి ఎలా తప్పిపోయాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### పట్టపగలే తాళాలు పగులగొట్టి..

మెట్‌పల్లి పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన రాగుల మారుతి మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత బుధవారం ఉదయం 11 గంటల సమయంలో భార్యతో కలిసి స్టీలు సామాను కొనుగోలు



చేసేందుకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో దంపతులు ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో కంగారుపడిన దంపతులు లోపలికి వెళ్లి చూడగా సామానంతా చిందరవందరగా పడివుంది. బీరువా తెరిచి ఉండగా, అందులో దాచుకున్న బంగారు ఆభరణాలు కనిపించలేదు. రెండు తులాల నెక్లెస్, కమ్మలు, బుట్టలు, మాటీలు, ఉంగరం కలిపి సుమారు ఆరు తులాల బంగారం చోరీకి గురైనట్లు మారుతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడు గంటల్లోనే ఆరు తులాల బంగారం మాయం ఇంటి యజమానులు బయటకు వెళ్లిన విషయాన్ని గమనించిన దొంగ.. కేవలం మూడు గంటల వ్యవధిలోనే తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడినట్లు తెలుస్తోంది. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పట్టపగలే కాలనీలోని ఇంట్లోకి దొంగ చొరబడటం స్థానికులను కలవరపరిచింది. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలే ఇప్పుడు పోలీసుల తీరుపై అనుమానాలకు కారణమవుతున్నాయి. దొంగను పట్టుకున్న స్థానికులుచోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్న వ్యక్తిని స్థానికులు గుర్తించి పట్టుకున్నట్లు సమాచారం. వారి చేతికి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతడు దొంగిలించిన సొత్తును కూడా గుర్తించి తిరిగి యజమానికి అప్పగించినట్లు తెలుస్తోంది. ఒక చోరీ కేసులో నిందితుడు దొరికాడు.. సొత్తు కూడా దొరికింది. ఆ సొత్తు బాధితుడి చేతికి చేరింది. ఇక మిగిలింది నిందితుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడమే. కానీ ఇక్కడే కథ అడ్డం తిరిగినట్లు పట్టణంలో చెప్పుకుంటున్నారు.

### సొత్తు ఇచ్చారు.. దొంగను వదిలేశారా..?

దొంగను ప్రజలు పట్టుకొని పోలీసులకు అప్పగించినా అతడి అరెస్టును ఇప్పటివరకు అధికారికంగా చూపలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అరెస్టు చేసి ఉంటే ఏ కేసులో చూపారు..? ఎప్పుడు కోర్టులో హాజరుపరిచారు..? ఎక్కడికి రిమాండ్ చేశారు..? అన్న వివరాలేవీ బయటకు రాలేదు. చోరీ సొత్తును యజమానికి అప్పగించిన పోలీసులు.. ఆ సొత్తును దొంగిలించినట్లు పట్టుబడిన వ్యక్తిపై మాత్రం ఎందుకు చర్య తీసుకోలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. సొత్తు రికవరీ అయినప్పుడు అది ఎక్కడి నుంచి వచ్చింది..? ఎవరి వద్ద దొరికింది..? అతడిని ఎందుకు అరెస్టు చేయలేదు..? అనే విషయాలపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దొంగను చాటుమాటుగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారా..? లేక స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించిన తర్వాత వదిలేశారా..? అన్నది తెలియడం లేదు. అరెస్టు చేసి ఉంటే ఆ వివరాలను చెప్పాలి. అరెస్టు చేయకపోతే ఎందుకు చేయలేదో చెప్పాలి. రెండింటిలో ఏదీ బయటకు రాకపోవడంతోనే ఈ వ్యవహారం వెనుక ఏదో మతలబు ఉందనే ప్రచారం మొదలైంది.

### ప్రజలు పట్టిస్తే.. పోలీసుల లెక్కల్లో చూపిస్తారా..?

చోరీ నిందితుడిని పోలీసులు తమ దర్యాప్తులో పట్టుకోలేదు. స్థానికులే గుర్తించి పట్టుకొని స్టేషన్‌కు అప్పగించారు. ఈ విషయాన్ని దాచాల్సిన అవసరం ఏమిటని పట్టణవాసులు ప్ర...

# తెలంగాణ వార్ రూమ్ నుంచి ఢిల్లీ జాతీయ వార్ రూమ్ వరకు...

**- జాతీయ కులగణన వంద రోజుల కార్యాచరణకు రుద్ర సంతోష్ కుమార్‌కు కీలక బాధ్యత**

**- తెలంగాణలో బూత్ స్థాయి అనుభవానికి జాతీయ స్థాయిలో గుర్తింపు**

హైదరాబాద్ సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర) :

తెలంగాణలో కులగణనను క్షేత్రస్థాయి వరకు సమన్వయం చేసిన రుద్ర సంతోష్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కీలక బాధ్యత అప్పగించింది. జాతీయ జనగణనలో కులగణన అంశంపై చేపట్టనున్న 100 రోజుల దేశవ్యాప్త కార్యాచరణకు ఏఐసీసీ వార్ రూమ్ సమన్వయకర్తగా ఆయనను నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఏఐసీసీ నుంచి నియామకపత్రం అందజేశారు, రాష్ట్రాల వారీ కార్యాచరణ, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, డిజిటల్ పర్యవేక్షణ, వారపు పురోగతి నివేదికలు, సంస్థాగత అనుసంధానాన్ని ఆయన పర్యవేక్షించనున్నారు.

**తెలంగాణ అనుభవం ఢిల్లీ బాధ్యత..**



2024--25లో తెలంగాణలో నిర్వహించిన కులగణన సందర్భంగా రుద్ర సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఇందిరా భవన్‌లో ప్రత్యేక వార్ రూమ్, సంప్రదింపు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండల, బ్లాక్, గ్రామ, బూత్ స్థాయి ప్రతినిధులతో నిరంతర సమన్వయం చేపట్టినట్లు పేర్కొన్నాయి, సుమారు 45 రోజులపాటు సాగిన ఈ ప్రక్రియలో రోజుకు 2,000 మందికి పైగా కార్యకర్తలు, సంస్థాగత ప్రతినిధులతో సంప్రదింపులు జరిపినట్లు, 100కు పైగా కుల సంఘాలు, సుమారు 35 వేల మంది బూత్ స్థాయి కార్యకర్తలతో అనుసంధానం చేసినట్లు వెల్లడించాయి.

**15 వారాల ప్రణాళికపై 45 నిమిషాల వివరణ..**

సెప్టెంబర్ 8న ఢిల్లీలోని ఏఐసీసీ ఇందిరా భవన్‌లో జరిగిన జాతీయ ఓబీసీ కార్యశాలలో 100 రోజుల కార్యాచరణపై చర్చ జరిగింది. ఏఐసీసీ జాతీయ సమన్వయకర్త కొప్పుల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓబీసీ, మైనారిటీ విభాగాలకు చెందిన జాతీయ, రాష్ట్రస్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్ర సంతోష్ కుమార్ 15 వారాల కార్యాచరణ ప్రణాళికను సుమారు 45 నిమిషాల పాటు వివరించారు. రాష్ట్ర స్థాయి నియంత్రణ కేంద్రాలు, ప్రధాన శిక్షకుల ఎంపిక, జిల్లా స్థాయి శిక్షణ, మండల--గ్రామ స్థాయికి విస్తరణ, డిజిటల్ పర్యవేక్షణ, వారపు నివేదికలు, రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడికి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

**దశలవారీగా 100 రోజుల కార్యాచరణ..**

రాష్ట్రాల వారీ అవగాహన కార్యక్రమాలతో ప్రారంభించి ప్రధాన శిక్షకులు, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో శిక్షణను విస్తరించనున్నారు. ఓబీసీ సామాజిక వర్గాలతో ప్రజా సంబంధ కార్యక్రమాలు, పౌర సమాజ సంస్థలతో అనుసంధానం, క్షేత్రస్థాయి స్పందనల సేకరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వారపు నివేదికల ఆధారంగా పురోగతిని సమీక్షించి అవసరమైన మార్గ దర్శకాలు అందించనున్నారు. తెలంగాణలో బూత్ స్థాయి వరకు పొందిన అనుభవం ఇప్పుడు ఢిల్లీ కేంద్రంగా దేశవ్యాప్త కార్యాచరణకు విస్తరిస్తోంది.

# దేవరకద్రను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి







తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 19:

దేవరకద్ర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధికి అవసరమైన నిధులకు కొదవే లేదని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా మదనాపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ముందుగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డిగ్రీ కళాశాల, వంద పడకల ఆసుపత్రి, కోర్టు నూతన భవనం, ఊకచెట్టు వాగుపై హై లెవల్ బ్రిడ్జి వంటి కీలక పనులకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రూ. 110 కోట్లతో అత్యాధునిక ఘాట్ రోడ్డును నిర్మించబోతున్నామని ప్రకటించారు. అలాగే రైతుల చిరకాల కోరిక అయిన కర్వేన రిజర్వాయర్ పనులను మరో ఏడు ఎనిమిది నెలల్లో పూర్తి చేసి నీటితో నింపుతామని, దీంతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. మదనాపురం, ముసాపేట, కౌకుంట్ల మండలాల్లో రూ. 49 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయ సముదాయాలను నిర్మిస్తామని, దసరా లోపు వాటికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల భారాన్ని మోస్తూనే రాష్ట్ర వ్యాప్తంగా హెచ్‌ఏఎం విధానంలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, విద్య ద్వారానే పేదరికం పోతుందనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నారని, మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేని రుణాలతో పాటు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు కేటాయిస్తున్నామని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కోయిలకొండలో అంగరంగ వైభవంగా బిజెపి జిల్లా అధ్యక్షుల పుట్టినరోజు వేడుకలు

కోయిలకొండ సెప్టెంబర్ 20 (విజన్ ఆంధ్ర)



నారాయణపేట జిల్లా బిజెపి అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ సత్య యాదవ్ జన్మదిన వేడుకలను కోయిలకొండ మండలంలో శ్రేణులు అంగరంగ వైభవంగా నిర్వహించాయి. జిల్లా బిజెపి నాయకులు, మండల మాజీ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం మండల కేంద్రంలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద సత్య యాదవ్ పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు గార్లపాడు గ్రామంలో సైతం ఈ వేడుకలను ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కోయిలకొండ మండలంలో సత్య యాదవ్ జన్మదిన వేడుకలను ఎంతో వేడుకగా జరుపుకుంటామని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే గొప్ప మనసున్న నాయకుడు సత్య యాదవ్ అని కొనియాడారు. ప్రజల కష్టాల్లో పిలిస్తే పలికే నేతగా నిలిచిన ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోడోని గుట్ట తండా సర్పంచ్ రఘునాథ్, మండల బిజెపి నాయకులు టి. వేణుగోపాల్, బి. శ్రీధర్, నక్క శంకర్, రాంపూర్ రాజేందర్ రెడ్డి, వెంకటేష్ నాయక్, ఇబ్రహీంనగర్ వీరేష్, గాజుల మొగులయ్య, బచ్చప్ప, అశోక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏమమ్మా....వ్యాపారం ఎలా ఉంది..?

**-మహిళ వ్యాపారితో ముచ్చటించిన మంత్రి దామోదర్...**

సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 20:-

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ. దామోదర్ రాజనర్సింహ ఆందోల్, వట్ పల్లి మండలాల్లో పర్యటన ఆదివారం సరదాగా కొనసాగింది. ఆందోల్- జోగిపేట



మున్సిపాలిటీ వెల్ కమ్ కమాన్ పనులను పరిశీలించిన ఆయన సమీపంలోని మొక్క జొన్న కంకులు అమ్ముతున్న మహిళ వద్దకు వెళ్లారు. ఏమమ్మా వ్యాపారం ఎలా జరుగుతుంది? లాభాలు వస్తున్నాయా లేదా అని ఆ మహిళతో వ్యాపార విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ మహిళ కూడా వ్యాపారం బానే వుంది సార్ అంటూ తెలిపింది. ఆ మహిళ వద్ద మొక్క జోన్న కంకిని మంత్రి కొనుగోలు చేసాడు. ఏమైనా సమస్యలున్నా పరిష్కరిస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ శేరి జగన్ మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్, నాయకులు పెద్దపట్ల వినయ్ గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.